క్లుప్తంగా

మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఘనస్వాగతం



వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమీక్షించడానికి హన్మకొండ కలెక్టరేట్‌కు బయల్దేరిన రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే కేఆర్‌.నాగరాజు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. మంత్రిని శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. కార్యక్రమంలో ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు, మాజీ సర్పంచ్ ఆరెల్లి చందనతోపాటు మడిపెల్లి లావణ్య, కోతి గీత, పోలోజు సంధ్య, యాదగిరి సనవత, గైని ధరణి, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు పర్లపెల్లి చిన్నబాబు, పులి రాజు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ, ప్రజల కోసం పని చేసే వారికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు రవివర్మ, నాయకులు శివాజీ, ప్రకాశ్, కూరతోట సురేశ్, కొలిపాక బుచ్చయ్య, లక్ష్మయ్య, రమేశ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో కురుమ సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో కురుమ కుల సంఘం భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీరన్న కురుమ కుల సంఘం డివిజన్ అధ్యక్షుడు బుడగొండ భిక్షపతి, కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి అల్లి రవి, డివిజన్ బాధ్యులు సుధాకర్, కంచు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రియాంక జన్మదిన వేడుక

నెక్కొండ : మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకను కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి కేక్ కట్ చేసి శ్రేణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గైని లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సింగం ప్రశాంత్, ముద్రబోయిన శ్రీకాంత్, నాయకులు మహ్మద్ అన్వర్ పాషా, బొడ్డుపల్లి యాదగిరి, కర్ర చెన్నారెడ్డి, లక్ష్మణ్, అఫ్జల్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సాయం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఈర్ల యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం 50 కేజీల బియ్యం, వంట నూనె సాయంగా అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఫౌండేషన్ ప్రతినిధి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ నాయక్ రాథోడ్, ప్రతినిధులు లేతాకుల సుధాకర్‌రెడ్డి, లేతాకుల మధుకర్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, సంపత్, యూసుఫ్, అశ్రఫ్ గజవెల్లి ప్రసాద్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అరెస్టు అప్రజాస్వామికం’

వర్ధన్నపేట : మండలానికి చెందిన ఓ ఛానల్ విలేకరి రాజ్‌కుమార్ అరెస్టు అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని చత్రుతండాలోని రాజ్‌కుమార్ నివాసాన్ని ఆదివారం ఆయన సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అరెస్టుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడారు. రాజ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, నాయకులు తుమ్మల యాకయ్య, ముత్యం సంపత్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి జాతరకు వేళాయె

- నేటి నుంచి లింగగిరిలో ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి


చెన్నారావుపేట : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లింగగిరిలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి జాతర మూడు రోజులపాటు వైభవంగా జరుగనుంది. గ్రామంలోని గుట్టపైకి భక్తులు వేల సంఖ్యలో చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించనున్నారు. నాలుగు వేల ఏళ్ల క్రితం దక్షిణాది నుంచి కీలు గుర్రంపై వచ్చిన శ్రీ చెన్నకేశవస్వామి తొలుత పెద్ద కుంట సమీపంలో ఉన్న సాకరికుంటలో వెలిశాడని..అయితే కుంటలో బట్టలు ఉతకడంతో గుట్ట సొరంగంలో వెలిశారని స్థానికులు చెబుతున్నారు.

నేడు గోదారంగనాథుల కల్యాణం

శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలిసిన స్వామి వారికి ప్రతి సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 15 నుంచి జనవరి 15 వరకు నెల రోజుల వరకు స్వామి వారికి పూజలు నిర్వహిస్తారు. స్వామి ఎదుట ఉన్న గద్దెలకు ముడుపులు చెల్లిస్తే కోరిన కోరికలు తీరుతాయని, సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. 13 భోగి రోజున శ్రీరంగనాథుడు–గోదాదేవి కల్యాణోత్సవం, 14 సంక్రాంతి రోజున ఎడ్ల బండ్ల ప్రదర్శన, జాతర కొనసాగుతుంది. 15న బుధవారం సహస్ర కుంకుమార్చన, స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు.



గుట్ట మీద ఉన్న ఆలయం



శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి విగ్రహం

ఏర్పాట్లు పూర్తి



జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. లైటింగ్, సౌండ్స్, దుకాణాలు ఏర్పాటు చేస్తున్నాం. నీటి, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు తరలిరావాలి. స్వామివారి ఆశీర్వాదం తీసుకోవాలి.

\- మాదాటి భాస్కర్, ఆలయ ఇన్‌చార్జ్

భక్తితో తరలిరావాలి



మూడు రోజులపాటు జరిగే శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి జాతరకు భక్తులు భక్తిశ్రద్ధలతో తరలిరావాలి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వైభవో పేతంగా జాతర జరుగుతుంది. కుటుంబంతో తరలివచ్చి స్వామి వారి ఆశీస్సులు పొందాలి.

\- సముద్రాల సుదర్శనాచార్యులు, అర్చకుడు

వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : పాకాల వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని బీఆర్‌ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దబ్బీరుపేట శివారులోని దబ్బవాగు వద్ద గోదావరి జలాలకు, పాకాలలో కట్టమైసమ్మకు ఆదివారం ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే తీసుకొచ్చిన నిధులకు సంబంధించిన జీఓలను దొంగ జీఓలని ప్రచారం చేసి వాటి ఆధారంగా వచ్చిన నిధులతోనే ఎమ్మెల్యే సొంత ఏజెన్సీతో పనులు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రాజెక్ట్ రూపకల్పన చేసినప్పుడే దబ్బీరుపేట, చిలుకమ్మనగర్, మంగళవారిపేట గ్రామాల్లో అదనపు సాగు నీరందించేలా కూసుకుంట డైవర్షన్‌తో డిజైన్ రూపొందించుకోవడానికి అనుమతులు సాధించుకున్నట్లు తెలిపారు. పాకాల వాగులపై బ్రిడ్జిల నిర్మాణానికి కోట్ల రూపాయలు మంజూరు చేయగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసిందని ధ్వజమెత్తారు. నిలిచిపోయిన బ్రిడ్జిలను తక్షణమే నిర్మించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సన్న ధాన్యానికి బోనస్ హామీగానే నిలిచిపోయిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం మళ్లీ మోసం చేస్తారన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు వేజేళ్ల కిషన్‌రావు, ఇరుకు దేవేందర్‌రావు, కవిత, మస్తాన్, ఆబోతు అశోక్, కాస ప్రవీణ్‌కుమార్, రాజుయాదవ్, నీలం సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి



ఏనుగల్‌లో ధర్నా రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

పర్వతగిరి : రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని ఏనుగల్‌లోని ప్రధాన రహదారిపై ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాల్సి ఉండగా సగం మందికి రుణమాఫీ చేయలేదని తెలిపారు. ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చి కొత్తగా రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మాట మార్చుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, యోగేందర్‌రావు, కోల మల్లయ్య, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



పర్వతగిరిలో..



ఖానాపురం : ధర్మరావుపేటలో..

వివేకానందుడి స్ఫూర్తిని కొనసాగించాలి

సాక్షి నెట్‌వర్క్ : వివేకానందుడి స్ఫూర్తిని కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, ఖానాపూర్, దుగ్గొండి, సంగెం, గీసుకొండ, పర్వతగిరి, రాయపర్తి, తదితర మండలాల్లో స్వామి వివేకానందుడి 162వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, రాజకీయ పార్టీల, ప్రజా, యువజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వామి వివేకానందుడి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు స్వామి వివేకానంద అందించిన స్ఫూర్తిని వివరించారు.



దుగ్గొండిలో..



వర్ధన్నపేట : ఇల్లందలో..



నల్లబెల్లిలో..



గీసుకొండ : ధర్మారంలో...



చెన్నారావుపేటలో..

బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి సరికాదు

- పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ

నర్సంపేట : బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యాలయ భవనంపై దాడి సరికాదని ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తే ప్రతిపక్షాలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే రాష్ట్రంలో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకే దాడికి తెగబడ్డారని మండిపడ్డారు. ప్రతిపక్షంపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి వెన్నుముద్దల శ్రీధర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శివరాత్రి స్వామి, నాయకులు మద్దెల సాంబయ్య, సంపంగి సాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం




నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన కలకొండ సంధ్యకు ఆమె చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. ఆమె భర్త లక్ష్మణమూర్తి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.25 వేల సాయం అందజేశారు. సంధ్యతో కలిసి హనుమకొండ జిల్లాలోని పరకాలలోని సీఎస్‌ఐ మిషన్ స్కూల్‌లో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు వాట్సప్ గ్రూప్ వేదికగా ఆదివారం స్పందించారు. ఈ సందర్భంగా సంధ్య మిత్రులైన శనిగరపు నవీన్, ఒంటేరి మధు, శంకర్, పూలదేవి, సునీత, కవిత, తదితరులు ఆదివారం ఖాదర్‌పేటకు చేరుకుని ఆమెకు మిత్రుల సహకారంతో సమకూర్చిన నగదును అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ముగ్గుల పోటీలు



గీసుకొండ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మచ్చాపూర్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పోటీ పడి ముగ్గులు వేశారు. లక్క మాధవి మొదటి, బుర్ర రజిత రెండో, మర్రి రిషిత మూడో స్థానంలో నిలవగా యూత్ అధ్యక్షుడు వేల్పుల సురేశ్, మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. న్యాయ నిర్ణేతగా ఐకేపీ సీసీ కోల శోభ వ్యవహరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్కర్సు రవికుమార్, నాయకులు దూపటి యుగేందర్, మర్రి కుమారస్వామి, సీఏలు నిర్మల, జ్యోతి, శోభ, సరిత, పత్తిపాక మిథున్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



పర్వతగిరి : అన్నారం షరీఫ్ దర్గా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ వెంకటస్వామి చెప్పారు. మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉత్సవాల పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. దర్గా సభ్యులు, సెక్యూరిటీ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ సమన్వయంతో పని చేయాలని సూచించారు.

చిన్న ఎల్లయ్యకు నివాళి

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో ఎంసీపీఐ (యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సంతాప సభలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎలకంటి (చిన్న) ఎల్లయ్యకు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో దొరలు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా ఎల్లయ్య క్రియాశీలకంగా పోరాడినట్లు తెలిపారు. నిత్యం పేదల పక్షపాతిగా పోరాటాలు నిర్మించారని చెప్పారు. పలు కేసుల్లో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు గోనె కుమారస్వామి, కుసుంబ బాబురావు, నాగెల్లి కొంరయ్య, రాజా సాహెబ్, ఎల్లబోయిన రాజు, మాషుక్, సదానందం, నాగరాజు, రమేశ్, భాస్కర్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్



నర్సంపేట : పట్టణానికి చెందిన బండి ప్రవీణ్‌కుమార్ స్పోర్ట్స్ కరాటే దూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్‌కు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో అసోసియేషన్‌అధ్యక్షుడు, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ నియామక పత్రం శనివారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌ను ప్రవీణ్‌కుమార్ సత్కరించి మాట్లాడారు. యువతను సన్మార్గంలో నడిపించడంలో కరాటే లాంటివి అవసరమని చెప్పారు. జిల్లాలో కరాటే అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా జనరల్ సెక్రటరీ రచ్చ శ్రీనుబాబు, కోశాధికారి ఊరకొండ చంద్రశేఖర్, 13 మండలాల అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాధవరెడ్డి

సంగెం : క్రీడలతో శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని రామచంద్రాపురంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. తద్వారా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని చెప్పారు. క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ నాయక్, అచ్చ నాగరాజు, భిక్షపతి, కృష్ణంరాజు, మల్లయ్య, గోవర్ధన్, వీరేశ్, కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సంగెం : మండలంలోని మొండ్రాయికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కద్దూరి భద్రయ్య, చాతాళ్ల జనార్దన్, పరికి వెంకటయ్య, చింతలపల్లిలో బానోత్ స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ నేత, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను కలిసి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, పసునూరి సారంగపాణి, కొనకటి మొగిలి, ఇజ్జగిరి అశోక్, పోశాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1979–80 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో నాటి మిత్రులు 46 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న స్కూల్‌లో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు నాడు పాఠాలు బోధించిన గురువులకు ఆహ్వానించి జ్ఞాపికలు, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరమల్ల రాములు, చిరంజీవి, రంగారెడ్డి, రజని, కోటేశ్వర్‌రావు, శ్రీలక్ష్మి, విష్ణుమూర్తి, సుహాసిని, నిర్మల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

‘ఆ భూములు కొనొద్దు’

నెక్కొండ: మండల కేంద్రంలోని 66, 66/1, 66/2 సర్వే నంబర్లలో ఉన్న నిర్మాణాలు, భూమిని కొనుగోలు చేయొద్దని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సదరు సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఎంత, దేవాదాయ శాఖ భూమి ఎంత, ఎవరి ఆధీనంలో ఉందన్న విషయమై సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ సహ చట్టం ద్వారా దరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారని చెప్పారు. 1965–66లో సర్వే నంబర్ 66లో 4.27 ఎకరాలు ఎవరి పేరు మీద నమోదు కాకపోగా చర్చి, దేవాలయ భూమి లేదన్నారు. 2005–06 రికార్డుల్లో ‘ఆయింజన్ ఫాదరి’ పేరు నమోదైనట్లు తెలిపారు. 1986–87 నుంచి సర్వే నంబర్ 66/2లో 23 గుంటలు ప్రభుత్వ భూమిగా నమోదైనట్లు చెపఆపరు. మొత్తం 5.07 ఎకరాల పంపిణీ విషయానికి సంబంధించిన రికార్డులు, ఫైళ్లు లభించకపోవడంతో సర్వే కోసం దరఖాస్తు చేయనున్నట్లు తెలిపారు.